క్లుప్తంగా

సాయిబాబాకు పాలాభిషేకం


సాయినాధునికి మహా పాలాభిషేకం నిర్వహిస్తున్న ఎంపీపీ

కార్వేటినగరం: స్థానిక సాయిబాలాజీ నగర్‌లోని శ్రీ సద్గురు షిరిడీ సాయినాధునికి గురువారం మహా పాలాభిషేకం నిర్వహించారు. అలాగే కాగడహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.ఎంపీపీ లత, వైస్ ఎంపీపీ మణెమ్మ స్వామివారికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బాలాజి, కమిటీ సభ్యులు చిరంజీవిరెడ్డి,రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

నేడు వారాహి ఆలయంలో మాంగల్య పూజ


అలంకరణలో వారాహి అమ్మవారు

పుత్తూరు: పరమేశ్వర మంగళం గ్రామ సమీపంలోని శ్రీదక్షిణ కాళీ వారాహి శక్తిపీఠంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చివరి రోజు శుక్రవారం మాంగల్య పూజలు నిర్వహించనున్నట్టు ఆల య చైర్మన్ మోహనమ్మ తెలిపారు. ఉదయం 9 గంటలకు వారాహి అమ్మవారికి విశేష అలంకరణతో బాలపూజ, కన్యపూజ చేస్తామని తెలి పారు. అనంతరం 108 మందితో మాంగల్య పూజ ఉంటుందన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మాంగల్య పూజలో పాల్గొనే భక్తులు ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఆలయ పూజారి రుతుపవన్ పాల్గొన్నారు.

వైభవంగా పంచభూత మహాయాగం


పంచభూత మహాయాగ పూజలు చేస్తున్న రమేష్‌స్వామి

నగరి : నగరి మున్సిపాలిటీ పరిధిలోని కేవీపీ ఆర్ పేట నందనార్ స్వామి ఆలయంలో గురువారం పంచభూత మహాయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఇప్పటికే ప్రజా సంక్షేమం కోసం దేశ వ్యాప్తంగా 31 పంచభూత మహాయాగాలను పూర్తి చేశామని నిర్వాహకులు తిరువియార్ రమేష్ స్వామి తెలిపారు. నగరి మున్సిపాలిటీ కేవీపీఆర్‌పేటలో 3 పంచ భూత యాగాలు పూర్తి చేశామని తెలిపారు. నాలుగోది 48 రోజుల పాటు పూజలు నిర్వహించామని, గురువారం నిర్వహించిన మహా యాగంతో ముగింపునకు చేరుకుందన్నారు. ప్రజలకు 18 మంది సిద్ధుల ఆశీస్సులతో సంతాన బలం, ఆయురారోగ్యాలు అందాలన్న ఆకాంక్షతోనే ఈ యాగాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నగరి : మండలంలోని తడుకుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లిన హెచ్‌ఎం విజయ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు మురుగేషన్, రాము, శివకుమార్, కేశవులును గురువారం సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వారు పాఠశాల అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల అభివృద్ధితోపాటు పిల్లలకు విద్య అందించడంతో ఎంతో కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రస్తు త హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు


సేంద్రియ ఎరువులతో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న వాసు

పాలసముద్రం: పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడితే అధిక దిగుబడులు పొందవచ్చని డీపీఎం వాసు తెలిపారు. మండలంలోని క్రిష్ణజమ్మపురంలో రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించి సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ విధానాలతో వరి సాగు చేయడం మంచిదన్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు సేంద్రియ వ్యవసాయంతో సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ పుష్ప, రైతులు షణ్ముగరెడ్డి, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్భాటమే.. ఆచరణ ఏదీ..?

కూటమి ప్రభుత్వం అవి చేస్తున్నాం.. ఇవి చేస్తున్నామని ప్రచార ఆర్భాటం తప్ప ఏ ఒక్కదాన్నీ సక్రమంగా అమలుచేయడం లేదు. సూపర్ సిక్స్ పథకాల పరిస్థితీ అంతే. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు మంజూరు పేరుతో హడావుడి చేసిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆచరణలో ఘోరంగా విఫలమయ్యారు. దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూలు నిర్వహించి ఐదు నెలలు పూర్తయినా రుణాలు మంజూరు కాలేదు. నిరుద్యోగులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం లేదు.

- కార్పొరేషన్ రుణాల కోసం యువత ఎదురుచూపు
- ఇంటర్వ్యూలు ముగిసినా మంజూరు కాని రుణాలు
- బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ
- నగరి మున్సిపాలిటీలో 70 యూనిట్లకు 492,
- మండల పరిధిలో 58 యూనిట్లకు 214 దరఖాస్తులు


అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు (ఫైల్)


కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

నగరి: నగరి మున్సిపాలిటీలోని 29 వార్డులకు సంబంధించి 70 యూనిట్లు మంజూరయ్యాయి. 492 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా నగరి మండలంలోని 19 పంచాయతీలకు 58 యూనిట్లు మంజూరుకాగా 214 మంది దరఖాస్తు చేసుకున్నారు. నగరి నియోజకవర్గంలో ఎంతో ఆర్భాటంగా బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుల స్వీకరణ, ఫిబ్రవరి 26, 27వ తేదీల్లో హడావుడిగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాల్లో బ్యాంకర్ల వాటా, ప్రభుత్వ సబ్సిడీ ఉంటుంది. వచ్చిన మొత్తంతో ఏదైనా వ్యాపారమో.. లేక చిన్న పరిశ్రమ పెట్టుకుని జీవనం సాగించవచ్చని నిరుద్యోగులు భావించారు. నెలలు గడుస్తున్నా రుణాల మంజూరు గురించి ఎవరూ పట్టించుకోలేదు. దీంతో అభ్యర్థులు అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎవరూ సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆశలు వదులుకున్నారు.

సిఫార్సు ఉంటేనే..

కూటమి ప్రభుత్వ పెద్దల సిఫార్సులు ఉన్న వారికే బ్యాంకర్లు రుణాలు ఇవ్వనున్నట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా నాయకులు తమ అనుయాయుల పేర్లతో జాబితా తయారుచేసి బ్యాంకర్లకు అందజేసినట్టు చర్చ జరుగుతోంది. విమర్శలు వస్తాయనే ఉద్దేశంతో దరఖాస్తులు స్వీకరించి తూతూమంత్రంగా ఇంటర్వ్యూలు నిర్వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొందరు అభ్యర్థులు రుణాలపై ఆశలు వదులుకున్నారు. మరికొందరు ఇంటర్వ్యూలు ముగిసినప్పటి నుంచి తమకు సబ్సిడీ రుణాలు ఎప్పుడు వస్తాయా అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉన్నత చదువులు చదివి ఖాళీగా ఉన్న యువతకు ప్రాముఖ్యత ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అభ్యర్థుల ఆశలు అడియాశలేనా?

ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసి నిర్వహించిన ఇంటర్వ్యూలు హుళక్కేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. బీసీ కార్పొరేషన్ ఇంటర్వ్యూల ప్రక్రియ ముగిసిన తర్వాత కొద్ది రోజులకే మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది అర్హుల జాబితా సిద్ధం చేసి బ్యాంకర్లకు పంపించారు. లబ్ధిదారుల ఖాతాలో సబ్సిడీ జమ అయితే కానీ రుణాలు మంజూరు చేయని పరిస్థితిలో బ్యాంకర్లు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నాలుగు నెలలుగా లబ్ధిదారులు బ్యాంకులు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నిధులు లేని కారణంగానే ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వ పెద్దలు ఏదో చేస్తామని భ్రమలు కల్పించడం తప్ప ఏవీ ఆచరణకు నోచుకోవడం లేదని, కార్పొరేషన్ రుణాల మంజూరు కూడా అంతేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బ్యాంకులకు అర్హుల జాబితా పంపించాం



కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు ముగిసిన వెంటనే అర్హు ల జాబితాను సిద్ధం చేశాం. ఈ జాబితాను అన్ని బ్యాంకులకు పంపించాం. బ్యాంకులు, ప్రభుత్వానికి సంబంధించిన ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

- కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నగరి మున్సిపాలిటీ

నోటీస్ బోర్డు

నేడు 'రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో'..

- కార్వేటినగరం: రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శేఖర్‌రాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ, శుక్రవారం కొల్లాగుంట క్రాస్‌లో సీఎస్ఐ చర్చి సమీపంలోని వెట్రివేల్ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, ఎంపీపీ లత ఆధ్వర్యంలో నిర్వహించే రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో..క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరణ కార్యక్రమానికి మండలంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, జగనన్న అభిమానులు తతరలిరావాలని కోరారు.

9న సార్వత్రిక సమ్మె

నగరి: లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 9న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేస్తున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య తెలిపారు. ఆయన గురువారం ఏఐటీయూసీ పట్టణ నాయకుడు రాజేంద్ర అధ్యక్షతన కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దోచి పెడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 12వ పీఆర్సీ విడుదల చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రేణిగుంట: కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి తిరుపతి రుయా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మునయ్య (42) మృతి చెందినట్లు రేణిగుంట పోలీసులు తెలిపారు. ఆర్ మల్లవరం పంచాయతీ, డీపీ కండ్రిగలో ఉంటున్న మునయ్య గత నెల 30న ఇంట్లో గొడవలతో మనస్తాపానికి గురై గడ్డి మందును తాగాడు. కుటుంబ సభ్యులు తిరుపతి రుయా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

డంపింగ్ యార్డు పరిశీలన


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ పురుషోత్తం

వెదురుకుప్పం: డంపింగ్ యార్డులో చెత్త నుంచి ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయించాలని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. గురువారం మండలంలోని కొమరగుంటలో డంపింగ్ యార్డును ఎంపీడీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద తయారు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం సమస్యలు లేకుండా చూడాలని, ఓవర్‌హెడ్ ట్యాంకులు, మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ పెద్దపోటుచేను ఆది ఆంధ్రవాడలో మృతుల కుటుంబాలను మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు కే. నారాయణ స్వామి పరామర్శించారు. స్థానిక సర్పంచ్ కుమారి తండ్రి జగ్గయ్య హఠాన్మరణం చెందారు. అలాగే అనారోగ్యంతో రాజమ్మ మృతి చెందింది. ఇరు కుటుంబాలను నారాయణస్వామి పరామర్శించారు. ఆయన వెంట మాంబేడు మాజీ ఎంపీటీసీ గురవారెడ్డి, యువత నాయకుడు బోడిరెడ్డి నరేష్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, మురళీ, వెంకటముని ఉన్నారు.

రావణేశ్వరుడిపై పరాశరేశ్వరస్వామి


భక్తులను కటాక్షిస్తున్న నటరాజస్వామి


రావణేశ్వర వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ ఆలయమైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులు రావణేశ్వర వాహనాన్ని అధిరోహించి గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలు పూర్తి చేసి, శివగామి సమేత నటరాజ స్వామి ఉత్సవం నిర్వహించారు. నటరాజ స్వామి తిరుచ్చి వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగుతూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న నటరాజస్వామికి ఆస్థానం నిర్వహించారు. 11 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వర ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను, హోమాలు చేపట్టారు. అనంతరం పరమ భక్తుడైన రావణబ్రహ్మ వాహనంపై స్వామివారు అధిష్టించారు. సర్కారు హారతి అందుకున్న ఉత్సవర్లు గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్ పర్యవేక్షించారు.

రథోత్సవం


రథంపై గ్రామ వీధుల్లో విహరిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజు ఉత్సవమూర్తులు

కార్వేటినగరం: మహా భారత వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి అర్చనలు అభిషేకాల అనంతరం ద్రౌపదీ, ధర్మరాజులకు ఉభయదారులు కరణీకులు సమర్పించిన పట్టు వస్త్రాలు, సుగంధ భరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. అలాగే కరణీక కులస్తులు నూతనంగా నిర్మించిన రథంపై కొలువుదీర్చి మంగళ వాయిద్యాలు, బాణసంచా మోత నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఉప్పు, మిరియాలు చల్లుతూ మొక్కులు చెల్లించారు. అలాగే ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు. భాగవతారిణి రెడ్డెమ్మ హరికథాగానం చేశారు. మధ్యాహ్నం వెంకటేశ్వర ఆటో యూనియన్ భక్తులకు అన్నదానం చేసింది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవియాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతంరాజు, అర్చకులు సుమన్‌యాదవ్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు అర్జున తపస్సు

శుక్రవారం ఉదయం 8 గంటలకు నంది వాహనంపై స్వామివారి ఊరేగింపు, మధ్యాహ్నం 12 గంటలకు అర్జున తపస్సు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అర్జున తపస్సు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు తెలిపారు.


భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

వారాహి అమ్మవారికి అభిషేకం


విశేషాలంకరణలో అమ్మవారు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వారాహి ఆషాఢ నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం వారాహి అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమాలకు నింద్ర గ్రామానికి చెందిన శ్రీ శ్రీనివాస మిల్క్ డెయిరీ సంస్థ యాజమాన్యం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వారికి ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందించారు. ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వాహణ అధికారి లత పర్యవేక్షించారు.

రైళ్లలో ఈగల్ టీం తనిఖీలు


రైల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రేణిగుంట: ఈగల్ టీమ్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సి బ్బంది సంయుక్తంగా రేణిగుంట రైల్వేస్టేషన్‌లో కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌తోపాటు పల్లు రైళ్లలో గురువారం తనిఖీలు చేశారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషన్ ఆర్పీఎఫ్ రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్ టీం సీఐలు ప్రసాద్, రవి నాయక్, జీఆ ర్పీ, ఆర్పీఎఫ్ సంయుక్తంగా రేణిగుంట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేశారు. బ్యాగ్‌లను క్షుణ్ణంగా డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. వారు మాట్లాడుతూ రైళ్ల ద్వారా ఇటీవల గంజాయి తదితర వస్తువులు అక్రమంగా రవానా అవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. ప్రయాణికులు కూడా తమకు ఏదైనా అనుమానాస్పదంగా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నేడు ఫుడ్ ప్రాసెసింగ్‌పై రైతులు, యువతకు శిక్షణ

శ్రీకాళహస్తి: తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు లోని రాస్ కార్యాలయంలో వారాహి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్పీఓ డైరెక్టర్లు, రైతులకు, యువతకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్, తొట్టంబేడు ఎఫ్‌పీసీ చైర్మన్ గుమ్మడిపూడి దశరదాచారి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తి గత యువకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెరుకు శ్రీహరి, కృష్ణయ్య, కుప్ప ప్రసాద్ కుమార్, జలగు శ్యాంసుందర్, జయచంద్ర పాల్గొన్నారు.

చిన్నారికి మాజీ మంత్రి ఆశీర్వాదం



విజయపురం : మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువ కార్యదర్శి అజిత్ కుమార్తె ప్రితిక మొదటి పుట్టిన రోజు వేడుకలు గురువారం జరిగింది. ఇందులో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. అలాగే కాళికాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ముత్తప్పరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె వెంట మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మండల ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సైతం విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య పాల్గొన్నారు.

ఫారమ్ పాండ్లు నిర్మించుకోవాలి


పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

బుచ్చినాయుడుకండ్రిగ: రైతుల పొలాల్లో ఫారమ్ పాండ్లు నిర్మించుకుని, నీటిని నిల్వ చేసుకోవాలని జిల్లా ఉపాధి హామీ పీడీ శ్రీనివాస ప్రసాద్ సూచించారు. ఆయన గురువారం మండలంలోని పల్లమాల చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా పనులు చేస్తే రోజువారీ కూలీ కొలతల ప్రకారం రూ.300 వస్తుందన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటరత్నమ్మ, ఉపాధి ఏపీఓ దేవరిలు ఉన్నారు.